క్లుప్తంగా

వేసవి విజ్ఞాన శిబిరం కరపత్రం ఆవిష్కరణ

కపిలేశ్వరపురం: పౌర గ్రంథాలయ శాఖ ద్వారా ప్రభుత్వం నిర్వహించేన వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమాల కరపత్రాన్ని స్థానిక సర్పంచ్ సాకా శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు. గ్రంథాలయాధికారిణి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి గ్రంథాలయంలో శిబిరాన్ని ప్రారంభించనున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు, కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పర్యవేక్షణలో నిర్వహించే శిబిరం జూన్ 11 పాఠశాలలు తెరిచేవరకూ కొనసాగనుందని గ్రంథాలయాధికారి తెలిపారు.

రాయవరం మండలంలో హౌసింగ్ డే



మాచవరంలో హౌసింగ్ డే తనిఖీలో పాల్గొన్న అధికారులు

రాయవరం: మండలంలోని హౌసింగ్, మండల పరిషత్ అధికారులు శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీవో డి.శ్రీనివాసు, హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి మాచవరంలో పర్యటించారు. ఆ గ్రామంలోని లే అవుట్‌లో నలుగురు లబ్ధిదారులతో నూతన గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండలంలో ఇప్పటి వరకు 1,650 ఇళ్లకు గాను 506 ఇళ్లను పూర్తి చేసినట్లు హౌసింగ్ డీఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22 ఇళ్ల ఆర్‌సీ స్థాయిలో, 53 ఇళ్లు ఆర్ఎల్, 418 బీఎల్ లెవల్లో ఉన్నాయన్నారు. వేసవికాలం ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉన్నందున వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత కత్తుల అప్పారావు, యానిమేటర్లు, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కాజులూరు మండల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. స్వయంగా మంత్రి వేణుగోపాలకృష్ణ సభానిర్వహణ బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులపై వ్యవసాయానికి సంబంధించిన వ్యవసాయశాఖా, నీటిపారుదల, డ్రైనేజీ శాఖల అధికారులు సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా జిల్లాలో వరి పంటకు తీవ్ర నష్టం జరిగిందని నష్టతీవ్రతపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రైతు పక్షపాతి అయిన సీఎం జగనన్న రైతులను తగిన రీతిలో ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీలు వి.విజయ, పెదిరెడ్డి వెంకటరమణ పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలను నమ్మే స్థితిలో రైతులు లేరు



వెంకటరమణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: తన పార్టీ అధికారంలో ఉండగా ఏనాడు రైతుల సంక్షేమం కోసం పాటుపడని టీడీపీ నేత చంద్రబాబునాయుడు నేడు కపటి ప్రేమ నటిస్తూ జగనన్న ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుంటే రైతులు నమ్మేస్థితిలో లేరని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాశ్ అన్నారు. మండల పార్టీ మహిళా విభాగనేత, గొల్లపాలెం ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మేడిశెట్టి వెంకటరమణమ్మ కుటుంబ సభ్యులను శనివారం సూర్యప్రకాశ్ తదితరులు పరామర్శించారు. వెంకటరమణమ్మ అత్తగారు సూర్యకాంతం (87) గత నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. పరామర్శ అనంతరం సూర్యప్రకాశ్ గ్రామంలోని రైతులతో మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులను తగిన రీతిలో ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టిందన్నారు. మండల పార్టీ యువజన విభాగ కార్యదర్శి నిమ్మితి విజయ్, సీహెచ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 75 శాతం ఉత్తీర్ణత

- సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి
- ఫీజు చెల్లింపునకు మే 15 వరకూ గడువు



మండపేట: పదో తరగతి పరీక్షల్లో మండపేట నియోజకవర్గం 75 శాతం ఉత్తీర్ణత సాధించింది. నియోజకవర్గం నుంచి మొత్తం 2,949 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 2,272 మంది పాసయ్యారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు జరిగాయి. ఫలితాలు విడుదల నేపథ్యంలో ఉదయం నుంచి విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. 11 గంటల సమయంలో ఫలితాలు విడుదల కాగా సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ సెంటర్ల వద్ద విద్యార్థులు ఆతృతగా ఫలితాలు చూసుకోవడం కనిపించింది.

79 శాతం ఉత్తీర్ణత

మండపేట పట్టణం, మండలంలో 79 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 1,747 మంది విద్యార్థులు హాజరుకాగా 1382 మంది కృతార్థులయ్యారు. వారిలో ప్రభుత్వ పాఠశాల నుంచి 1015 మంది హాజరు కాగా 673 మంది, ప్రైవేట్ పాఠశాల నుంచి 732 మంది హాజరు కాగా 709 మంది పాసయ్యారు. పలువురు అత్యధిక మార్కులు సాధించారు.మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఎంఈఓ ఎస్.రామచంద్రరావు అభినందించారు. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల కోసం ఈనెల 15 లోగా ఫీజు చెల్లించాలని సూచించారు. జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు.

'పది'లో ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం

రాయవరం: టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం కొనసాగింది. వెదురుపాక, రాయవరం, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 642 మంది విద్యార్థులకు గాను 462 మంది 71 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏ ఒక్క పాఠశాల శత శాతం ఉత్తీర్ణత సాధించక పోవడం గమనార్హం. ఫలితాల్లో పసలపూడి జెడ్పీహెచ్ఎస్ 72.73 శాతంతో మండలంలో ప్రథమస్థానంలో నిలవగా, 44.83 శాతం ఉత్తీర్ణతతో జెడ్పీహెచ్ఎస్, మాచవరం చివరి స్థానంలో నిలిచింది. మండలంలో బాలురు ఉత్తీర్ణత శాతం 66.98 శాతం కాగా, బాలికల ఉత్తీర్ణత శాతం 74.78 శాతంగా ఉంది. మండలంలో ఐదు ప్రైవేట్ పాఠశాలల నుంచి 207 మంది పరీక్ష రాయగా, 202 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద మండల ఉత్తీర్ణత 97.58 శాతంగా ఉంది.

కపిలేశ్వరపురం మండలంలో 76 శాతం

కపిలేశ్వరపురం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ఎనిమిది ప్రభుత్వ, మూడు ప్రైవేటు మొత్తం 11 పాఠశాలలకు చెందిన 560 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వారిలో 428 మంది ఉత్తీర్ణులు కావడంతో 76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 473 మంది విద్యార్థులు హాజరు కాగా 349 మంది ఉత్తీర్ణులై 74 ఉత్తీర్ణత శాతం లభించింది. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో టేకి జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూరు శాతం, అంగర, వాకతిప్ప పాఠశాలలకు 83 శాతం చొప్పున, వల్లూరు 76, మాచర 67, నల్లూరు 66, కపిలేశ్వరపురం 65, కాలేరు పాఠశాల 64 శాతం ఫలితాలు సాధించాయి. టేకి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 24కి అందరూ ఉత్తీర్ణులయ్యారు. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 70కి 53 మంది ఉత్తీర్ణులయ్యారు. వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో 18 కి 15 మంది ఉత్తీర్ణులయ్యారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 105 కి 70 మంది ఉత్తీర్ణులయ్యారు.ఇక అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 109 మందికి 91 మంది ఉత్తీర్ణులయ్యారు. నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 44 కి 29 మంది ఉత్తీర్ణులయ్యారు. కాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 22 కి 14 మంది ఉత్తీర్ణులయ్యారు. కపిలేశ్వరపురంలో 81 కి 53 మంది ఉత్తీర్ణులై 65 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



కాజులూరు: శనివారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కాజులూరు మండలంలో సగటున 75 శాతం విద్యార్థులు ఉతీర్ణత సాధించగా మంజేరు జెడ్పీ హైస్కూల్‌లో నూరు శాతం ఉతీర్ణ సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి కేవీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మొత్తం 11 ప్రభుత్వ పాఠశాలల నుంచి 605 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 431 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించారన్నారు. పది ఫలితాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎంఈఓ సత్యనారాయణ, ఎంపీడీఓ సీహెచ్ ఇందిరాదేవి, మండల తహసీల్దారు బి.సాయిసత్యనారాయణ, ఎమ్మార్పీ లోవరాజు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు అభినందించారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదివిన పేద విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో కలిపి 62 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ ఎ.నాగరాజు శనివారం విలేకరులకు తెలిపారు.

నిరాశ పరిచిన పది ఫలితాలు..

రామచంద్రపురం రూరల్: ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు నిరాశ పరిచాయి. శనివారం విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం గణనీయంగా తగ్గిపోయింది. ఎంఈవో మానుపూడి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో 86 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 50 మంది ఉత్తీర్ణులయ్యారు. నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో 70 మందికి 20 మంది, వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో 74 మందికి 44 మంది, వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 40 మందికి 30 మంది, వేగాయమ్మపేటలో 21 మందికి 15 మంది, ద్రాక్షారామలో 127 మందికి 42 మంది, బీసీ వెల్ఫేర్ గరల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 12 మందికి 10 మంది, ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 72 మందికి 37 మంది ఉత్తీర్ణులయ్యారు.

రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం: పట్టణంలోని చాకలిపేట మున్సిపల్ హైస్కూల్‌లో 91 మందికి 56 మంది, కొత్తూరు హైస్కూల్‌లో 32 మందికి 25 మంది, ఎ.సావరం హైస్కూల్‌లో 50 మందికి 37 మంది, పిల్లా వారి హైస్కూల్ 57 మందికి 29 మంది, రత్నంపేట హైస్కూల్‌లో 66 మందికి 43 మంది, రామచంద్రపురం జెడ్పీ హైస్కూల్‌లో 19 మందికి ఆరుగురు, శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు గవర్నమెంట్ హైస్కూల్‌లో 85 మందికి 32 మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రాథమిక హక్కులు ఉల్లంఘన జరగకుండా చూడాలి



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు

రామచంద్రపురం: భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు ఉల్లంఘన కాకుండా వాటిని కాపాడుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు అన్నారు. రామచంద్రపురం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కేశవానంద భారతీ కేసు తీర్పు వచ్చి శనివారానికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో జడ్జి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేశవానంద భారతీ కేసులో అప్పటి సుప్రీంకోర్టులో 13 మంది జడ్జిల ధర్మాసనం 888 పేజీలతో కూడిన ప్రతిష్టాత్మకమైన తీర్పు వెలువరించారన్నారు. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అయితే మనిషి మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు.

కార్యక్రమంలో ఏజీపీ, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ మోహన్ వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వాద్రేవు సాయిప్రసాద్, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ రామయ్య, మాజీ ఏజీపీ కాలుకురచ వీవీ సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఇనకోటి చంద్రరావు, నేలపాటి వీరభద్రరావు, ఎస్.శేషుకుమార్ తదితర న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రజాప్రతినిధులు అండగా నిలవాలి

మంత్రి చెల్లుబోయిన వేణు



మంత్రి వేణు సమక్షంలో వ్యవసాయ శాఖ ప్రగతిని వివరిస్తున్న ఏఓ బలుసు రవి

కె.గంగవరం: అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు అండగా నిలవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 1500 హెక్టార్లలో వరి సాగు చేశారని ప్రస్తుతం 20 శాతం వరికోతలు అయ్యాయన్నారు. అకాల వర్షాల కారణంగా రోడ్లు, దిమ్మలపై ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయాయని వాటిని కూడా కోనుగోలు చేయాలని ఆదేశించామన్నారు. ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రతి రైతులకు సీఎం జగన్ ప్రభుత్వంలో రైతులు ఎవకే అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ శాఖల నుంచి గ్రామ స్థాయి నివేదికను సభ్యులకు తెలపాలని చెప్పారు. సమావేశంలో తొలుత వ్యవసాయ శాఖ ఏఓ బలుసు రవి మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యులు పిల్లి దుర్గాప్రసాద్, కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్‌లు తోకల మంగ, చిల్లే నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎక్కువగా బొండాలను సాగు చేశారని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఓ రవి మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల బొండాలను కూడా కొనుగోలు చేయాలని సూచించారని ఎటువంటి నిబంధనలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సభ్యులకు తెలిపారు.

చంద్రబాబు వాఖ్యలను తిప్పికొట్టాలి..

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు రామచంద్రపురం నియోకవర్గం వచ్చి రైతులను పరామర్శించి అబద్ధాలను ప్రచారం చేశారని గ్రామ స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆ వాఖ్యలను తిప్పికొట్టాలని ఆదేశాంచారు. మండల వ్యాప్తంగా సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు కేవలం రైతులకు రూ.360 కోట్లకు పైగా ఇన్సూరెన్సు, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి వేశామన్నారు. ప్రభుత్వం రైతులకు చేస్తున్న మేలును ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరావు, నీతిపూడి మదుబాల, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్పంచ్ ఆరిఫ్‌కు పౌర సన్మానం



సర్పంచ్ ఆరిఫ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, సోమేశ్వరం గ్రామస్తులు

రాయవరం: సోమేశ్వరం పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సర్పంచ్ ఆరిఫ్ అభివృద్ధికి ఆద్యుడిగా నిలుస్తున్నాడని వక్తలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021–22 సంవత్సరానికి ప్రకటించిన ఉత్తమ పంచాయతీల కేటగిరీలో జిల్లాలో మూడు, మండల స్థాయిలో తొమ్మిది అవార్డులు కైవసం చేసుకున్న నేపథ్యంలో సర్పంచ్ ఆరిఫ్‌కు శనివారం పౌర సత్కారం నిర్వహించారు. సెక్రటరీ డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సత్కార సభలో సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సోమేశ్వరం దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు తదితరులు సర్పంచ్ నిరంతర కృషిని కొనియాడారు. సర్పంచ్ ఆరిఫ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పంచాయతీ మూడు అవార్డులు సాధించిడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. సర్పంచ్ ఆరిఫ్‌ను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు దుశ్శాలువా, జ్ఞాపికతో ఘన సత్కారం నిర్వహించారు. ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ (బుజ్జి), అధిక సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఎస్‌డీఆర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్టేషన్‌లో విధులను అడ్డుకోవడంపై కేసు

రాయవరం: స్టేషన్‌లో కానిస్టేబుల్ విధులను అడ్డుకోవడంతో పాటు, ప్రభుత్వాస్తిని ధ్వంసం చేయడంపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 5న మండలంలో మాజీ సీఎం చంద్రబాబునాయుడి పర్యటన జరుగుతున్నందున, ఆయన పర్యటనకు ఆటంకం కలగజేస్తుందని, ముందస్తు చర్యగా పసలపూడికి చెందిన కొవ్వూరి శ్రీలక్ష్మి అలియాస్ సనా ఫాతిమాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆమెను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకుని రాగా, స్టేషన్లో కంప్యూటర్ వర్క్ చేస్తున్న కానిస్టేబుల్ సుధాకర్ ఆమె నుంచి వివరాలు సేకరిస్తున్నాడన్నారు. దీంతో కానిస్టేబుల్ సుధాకర్‌ను పరుషంగా మాట్లాడుతూ, నాపైనే ఎఫ్ఐఆర్ వేస్తావా, నీ అంతు చూస్తాను అంటూ కేకలు వేసిందన్నారు. అంతేగాకుండా పోలీసు స్టేషల్‌లో ఉన్న కంప్యూటర్ మానిటర్, కీ బోర్డును నేలకేసి కొట్టిందన్నారు. ఆమె భర్త పాషా వచ్చి ఏమి జరిగిందని అడగ్గా, కానిస్టేబుల్ సుధాకర్‌ను వేలి పెట్టి చూపించి నాపై ఎఫ్ఐఆర్ వేస్తున్నాడని, వివరాలు అడుగుతున్నట్లు చెప్పిందన్నారు. దీంతో సనా ఫాతిమా భర్త పాషా కూడా సుధాకర్‌తో గొడవకు దిగాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మండపేట రూరల్ సీఐ శివగణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్పందించిన దాతృత్వం

- రూ. 2.5 లక్షలు విరాళాల సేకరణ
- అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు మార్గం సుగమం



క్రీడాకారులను సత్కరించి విరాళాల సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

మండపేట: ప్రతిభను చాటేందుకు అడ్డంకిగా మారిన పేదరికాన్ని దాతృత్వం జయించింది. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులకు మార్గం సుగమం చేసింది. పట్టణానికి చెందిన వడ్డాది వినయ్‌కుమార్, పిల్లి రామారావు గత నవంబరులో జరిగిన నేషనల్ టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ చూపి ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికయ్యారు. సెప్టెంబరులో దక్షిణాఫ్రికాలో ఈ పోటీలు జరుగనున్నాయి. ప్రయాణ ఖర్చులు, వీసా, అకామిడేషన్ తదితర ఖర్చులు నిమిత్తం ఒక్కొక్కరూ 1.25 లక్షల చొప్పున రూ. 2.5 లక్షలను వారు టెన్ని కాయిట్ అసోసియేషన్‌కు చెల్లించాలి. ఇరువురూ నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో అసోసియేషన్‌కు సొమ్ములు చెల్లింపు భారంగా మారింది. వీరికి తోడ్పాటును అందించే బాధ్యతను పట్టణంలోని ఒక లోకల్ చానల్ నిర్వాహకులు తీసుకున్నారు. సోషల్ మీడియా ద్వారా వీరి పరిస్థితిని వివరించి దాతలు స్పందించి సాయం అందించాలని కోరారు. పట్టణంలో దాతలు ముందుకు వచ్చి రూ. 1,52,081 విరాళాలు అందించారు. స్థానిక ఎంపీఎస్ స్కూల్‌లో స్కూల్ కరస్పాండెంట్ వల్లూరి చిన్నారావు అధ్యక్షతన పౌర సన్మానం నిర్వహించగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుండు తాతరాజు, చెన్నా రాంబాబు, హెచ్ఎం ముంగర వెంకట్రాజు తదితరులు హాజరై వినయ్, రామారావు, కోచ్ కుంచే రమేష్‌లను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి మండపేటకు ఖ్యాతి తీసుకు రావాలని ఆకాంక్షించారు. శ్రీవరప్రకాష్ రూ 25,000 విరాళాన్ని క్రీడాకారులకు అందజేశారు. ఇంకా రూ. 72,000 అవసరం కాగా ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల, పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నేత వేగుళ్ల చైతన్యబాబు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రైతుల వెన్నంటి నిలవండి

అధికారులకు ఆర్డీఓ ఆదేశం



ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: రబీ పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకునే వరకూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది రైతు వెన్నంటి నిలవాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. వర్షానికి రబీ పంట ప్రభావితమైన నేపథ్యంలో మండలంలోని వెదురుమూడి, వల్లూరు, అంగర, పడమర ఖండ్రిక, టేకి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను, ఆరబెట్టిన ధాన్యాన్ని శనివారం ఆమె పరిశీలించారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఏవో కేవీఎస్ రమేష్ కుమార్‌లు మండలంలోని పరిస్థితిని వివరించారు. వర్షాలు పడతాయన్న సమాచారంపై రైతులను కోతలు చేపట్టవద్దని గ్రామాల్లో రైతులకు సమాచారాన్ని ఇచ్చామన్నారు. ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం రైతులతో మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు, ఆర్‌బీకేల వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.సువర్చలనాయుడు ఆధ్వర్యంలో ఆలమూరు-2, కలవచర్ల, పినపళ్ల, సంధిపూడి, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల, మోదుకూరు, నవాబుపేట, మడికి శివారు మల్లవాని తోట, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు.

బ్లూ మార్చ్‌కు అనుమతులు లేవు

రావులపాలెం: స్థానిక రావులపాలెం సెంటర్ ఆదివారం జరపనున్న బ్లూ మార్చ్‌కు పోలీసుల తరపున ఎటువంటి అనుమతులు లేవని ఎస్సై ఎం.వెంకటరమణ శనివారం తెలిపారు. బ్లూ మార్చ్ వల్ల పొలిటికల్ గ్రూప్స్‌గా ఏర్పడి ప్రజాశాంతికి భంగం కలిగే విధంగా ఉన్నందున, నేషనల్ హైవేపై వాహనాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున ఈ బ్లూమార్చ్ ర్యాలీకి అనుమతులు ఇవ్వలేకపోతున్నామన్నారు.

సోమేశ్వరంలో వైభవంగా శ్రీపుష్పయాగం



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, అమ్మాజీ దంపతులు

రాయవరం: సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీపుష్పయాగాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ అర్చకత్వంలో శ్రీపుష్పయాగాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, అమ్మాజీ దంపతులు పీటలపై కూర్చుని పూజాదికాలు నిర్వహించారు. యాగంలో భాగంగా పలు రకాల పండ్లు, స్వీట్లు స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ఊంజలసేవ నిర్వహించారు. సర్పంచ్ ఆరిఫ్, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఆలయ ఈవో ఎస్.అయ్యపరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు



జగన్నాథగిరిలో నీటమునిగిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న పీఎస్ ప్రద్యుమ్న, మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: భారీ వర్షాల కారణంగా నీట తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సచివాలయ ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా తదితర అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని గొల్లపాలెం, జగన్నాథగిరి గ్రామాల్లో కాకినాడ, కోటిపల్లి రోడ్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. జగన్నాథగిరిలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, పలువురు రైతులు ఆయనను కలసి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండల గ్రామాల్లో జరిగిన పంట నష్టాలను వివరించారు. తడిసి రంగు మారిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. నష్టతీవ్రతపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జేడీఏ ఎస్.విజయ్‌కుమార్, కరప ఏడీఏ కె.బాబూరావు, మండల తాహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ, ఏఓ వి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.